సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



భూసారానికి పరీక్ష

భూ సారం తెలిస్తే పంటల సాగు సులభమవుతుంది. నేలకు తగిన పంట సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం కలుగుతుంది. సాగు లాభదాయకంగా మారుతుంది. - 8లో



ఆరోగ్యశ్రీ ద్వారా అరుదైన శస్త్రచికిత్స

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ఓయువతిని ఆదుకుంది. వేలమందిలో ఒకరికి వచ్చే అరుదైన వ్యాధితో బాధపడుతున్న యువతికి స్వస్థత చేకూర్చింది. - 8లో

నేడు రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడి పర్యటన

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో మంగళవారం రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు పర్యటిస్తారని జిల్లా పౌరసరఫరాల అధికారి కేవీఎల్ఎన్.మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటన అనంతరం కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

ఇఫ్తార్ సహర్

మంగళ (సా॥)	బుధ (ఉ॥)
6:16	4:19

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

సైన్స్ పరీక్షకు రెండు బుక్‌లెట్‌లు

పార్వతీపురం: పదోతరగతి విద్యార్థులకు ఈ నెల 13న జరగనున్న సైన్స్ పరీక్షకు రెండు బుక్‌లెట్‌లను అందిస్తామని డీఈఓ ఎస్‌డీవీ రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భౌతిక శాస్త్రానికి 12 పేజీల ఆన్సర్ బుక్‌లెట్‌ను, జీవశాస్త్రానికి మరో 12 పేజీల ఆన్సర్ బుక్‌లెట్‌ను విడివిడిగా అందిస్తామని తెలిపారు. ఈ రెండు ఆన్సర్ బుక్‌లెట్‌లకు ఓఎంఆర్‌లు వేరువేరుగా జతపరచాలన్నారు. విద్యార్థులు భౌతిక శాస్త్రానికి సంబంధించిన సమాధానాలు భౌతిక శాస్త్రం బుక్‌లెట్‌లోను, జీవశాస్త్రానికి సంబంధించి సమాధానాలను జీవశాస్త్రం ఆన్సర్ బుక్‌లెట్‌లో రాసేలా విద్యార్థులకు ఇన్విజిలేటర్లు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు అయోమయానికి గురికాకుండా ఇన్విజిలేటర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

గ్రామ దేవత పండగ చాటింపు



కమిటీ సభ్యుల సమక్షంలో పార్వతీపురంలో గ్రామదేవతల పండగ చాటింపు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణంలో మే 28, 29, 30 తేదీల్లో జరగనున్న ఇప్పలపోలమ్మ, ఎర్రకంచమ్మ గ్రామదేవత పండగకు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం చాటింపు వేశారు. కోవిడ్ కారణంగా నాలుగేళ్లుగా పండగ జరపలేదు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలించడంతో పండగ నిర్ణయించేందుకు గ్రామస్తులు, పెద్దలు నిర్ణయించారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు పండగకు ప్రభుత్వపరంగా సహకారం అందజేయాలని మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానించడంపై కమిటీ సభ్యులు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మంత్రి రవికుమార్, జయప్రకాష్‌నారాయణ, మాధవ పాల్గొన్నారు.


40 ఏళ్ల తర్వాత...



కొండాపురంలో గ్రామదేవత పండగ ఏర్పాట్లలో నిమగ్నమైన కమిటీ సభ్యులు

పాలకొండ రూరల్: మండలంలోని కొండాపురంలో గ్రామదేవత పండగ నిర్వహించాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. ఈ నెల 23వ తేదీ నుంచి 12 రోజులపాటు పండగ నిర్వహించాలని తీర్మానించారు. 40 ఏళ్ల తరువాత జరుగుతున్న పండగలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆస్పత్రుల్లో కోవిడ్ మాక్ డ్రిల్



జిల్లా ఆస్పత్రిలో మాక్ డ్రిల్‌ను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రిలో సోమవారం కోవిడ్-19 మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.బగాది జగన్నాథరావు జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. కోవిడ్ సమయంలో అవసరమైన ఆక్సిజన్ ప్లాంట్లు, వెంటిలేటర్లు, అవసరమైన చికిత్స చేయడానికి కావలసిన మందుల అందుబాటుపై సమీక్షించారు. కోవిడ్‌వ్యాప్తి చెందకుండా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, మాస్కు ధరించాలని సూచించారు. పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో మొత్తం 150 బెడ్స్ ఉండగా అందులో ఆక్సిజన్ బెడ్స్ 129, ఐసీయూ బెడ్స్ 15, వెంటిలేటర్ బెడ్స్ ఆరు ఉన్నాయని నిర్ధారించారు. 17 వెంటిలేటర్లు, 9 నెబులైజర్లు, 60 ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్, 255 ఆక్సిజన్ సిలిండర్లు, 1పీఎస్‌ఏ, 1 ఆక్సిజన్ స్టోరేజ్ టాంక్ అందుబాటులో ఉన్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వాగ్దేవి, డిస్ట్రిక్స్ ఎపిడమియోలజిస్ట్ డా.నవీన్ కుమార్, అనస్తీ షియన్ డా.ధనుంజయ్, ఆర్ఎంఓ డా.శేషగిరిరావు పాల్గొన్నారు. కోవిడ్-19 మాక్ డ్రిల్‌లో భాగంగా చినమేరంగి సీహెచ్‌సీను ఆర్‌బీఎస్ కేపీఓ డా.ధవళభాస్కరరావు, కురుపాం సీహెచ్‌సీని జిల్లా మలేరియా నివారణ అధికారి డా.శ్యామ్, సీతంపేట ఏరియా ఆస్పత్రిని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్ఓ విజయపార్వతి, భద్రగిరి సీహెచ్‌సీను డా.వినోద్‌కుమార్ సందర్శించారు.

భోగాపురం విమానాశ్రయం నిర్మాణానికి

సర్వం సిద్ధం

- 3న భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు శంకుస్థాపనకు ఏర్పాట్లు
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు
- నిర్వాసితులకు పరిహారం, పునరావాసం పూర్తిగా అందజేత
- అన్ని మౌలిక వసతులతో రెండు కాలనీల నిర్మాణం
- విమానాశ్రయం నిర్మాణానికి భూసేకరణ దాదాపుగా పూర్తి





ఈ చిత్రం చూశారా? 2019 ఫిబ్రవరి 14వ తేదీన నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించిన శిలాఫలకం! భోగాపురం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి ఉద్దేశించినదే! జాతీయ రహదారికి సమీపంలోనో, విమానాశ్రయానికి ఉద్దేశించిన కీలకమైన ప్రదేశంలో గాకుండా ఎక్కడో సముద్రానికి సమీపంలో, ఓ ప్రైవేట్ లేఅవుట్ ప్రహరీకి ఆనుకొని వేసిన శిలాఫలకం ఇది. ఎందుకలా? అంటే... భూసేకరణ పూర్తికాలేదు. రైతులు కోర్టుల మెట్టు ఎక్కారు. నిర్వాసితులకు అతీగతీ లేదు. మరోవైపు జిల్లాకు చెందిన అశోక్ గజపతిరాజు అప్పటికి కొద్దిరోజుల క్రితం వరకూ విమానయాన శాఖ మంత్రిగా ఉన్నా కేంద్ర ప్రభుత్వం నుంచీ అనుమతులేవీ కొలిక్కిరాలేదు. దేనికేదీ కొలిక్కిరాకపోయినా 2019 సార్వత్రిక ఎన్నికలకు రెండు నెలల ముందు ఆదరాబాదరాగా చంద్రబాబు వచ్చేసి టెంకాయ ఎందుకు కొట్టారో? సామాన్యులకూ తక్కున తెలిసిపోతుంది.. ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసమని!



ఇప్పటి అసలు చిత్రం ఇది. అంతర్జాతీయ స్థాయిలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సేకరించిన భూమి. కోర్టులోఉన్న న్యాయవివాదాలను సామరస్యంగా పరిష్కరించారు. కొంతమందితో సుదీర్ఘ న్యాయపోరాటం చేసి చివరకు సానుకూల తీర్పు సాధించారు. సంబంధిత రైతులు, నిర్వాసితుల త్యాగానికి తగిన పరిహారం చెల్లించడమే గాక టౌన్‌షిప్‌లను తలదన్నేలా అన్ని మౌలిక సౌకర్యాలతో నిర్మించిన రెండు కాలనీల్లో పునరావాసం కల్పించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి అనుమతులన్నీ సాధించారు. అన్ని అడ్డంకులు, ఆటంకాలనూ పరిష్కరించిన తర్వాతే నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్న మాటను నిలబెట్టుకున్నారు నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఇవన్నీ చూస్తే ఆయన ఉద్దేశమేమిటో ఎవరికైనా అర్థమవుతుంది... ఎన్నాళ్లగానో అభివృద్ధిలో వెనుకబాటులోనున్న విజయనగరం జిల్లానే గాకుండా యావత్ ఉత్తరాంధ్ర దశాదిశా మార్చాలని!

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఉమ్మడి విజయనగరం జిల్లానే గాకుండా ఉత్తరాంధ్ర ప్రగతికి ఊతం ఇచ్చే అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం త్వరలోనే సాకారం కానుంది. మే 3వ తేదీన శంకుస్థాపన రాయి పడనుంది. ఈ బృహత్తర క్రతువుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి హాజరవుతారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మౌలిక వసతుల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్వయంగా వెల్లడించారు. ఈ శుభ సందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెప్పడానికి భారీ బహిరంగసభ నిర్వహణకూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు సాగుతున్నాయి.

నాడు ఓట్ల కోసం టీడీపీ మమ...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు బీజం పడింది. తొలుత 15 వేల ఎకరాలు సేకరిస్తారని టీడీపీ నాయకులు ప్రకటనలు చేయడంతో భోగాపురం మండల రైతులు తీవ్ర ఆందోళనలకు దిగారు. దీంతో ఐదు వేల ఎకరాలతో సరిపెట్టాలని నాటి టీడీపీ ప్రభుత్వం దిగొచ్చింది. తీరా రైతులకు పరిహారం ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున ప్రకటించింది. మళ్లీ దీనిని వ్యతిరేకిస్తూ 2015 ఆగస్టులో రైతులు రోడ్డెక్కారు. నిబంధనలేవీ పాటించకుండా నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ కొంతమంది హైకోర్టులో పిటిషన్లు వేశారు. అవి పెండింగ్‌లో ఉండగానే 2019 సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి కోసం చంద్రబాబు శంకుస్థాపన ఘట్టం మమ అనిపించేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తానే నిర్మించానని చెప్పుకోవాలనే ప్రచార యావతోనే హడావుడిగా శంకుస్థాపన చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి.

భూసేకరణ దాదాపుగా కొలిక్కి...

విమానాశ్రయ నిర్వహణకు, ఇతర అనుబంధ కార్యకలాపాలకు 2,750.78 ఎకరాలు సరిపోతాయని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో 422.69 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక 1,413 మంది రైతులకు చెందిన 1,383.39 ఎకరాల జిరాయితీ భూమి, 572 మంది లబ్ధిదారుల స్వాధీనంలో నున్న డీ పట్టా (అసైన్డ్) భూమి సేకరణ ప్రక్రియను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. విమానాశ్రయ పరిధిలోనే గత టీడీపీ ప్రభుత్వం అక్కడక్కడ వదిలేసిన దాదాపు 117 ఎకరాల సేకరణ కూడా ఇప్పుడు పూర్తయింది. జాతీయ రహదారి నుంచి అనుసంధాన రోడ్డు, ట్రంపెట్ ఆకారంలో వంతెన నిర్మాణానికి అవసరమైన 119 ఎకరాల సేకరణ రెండో దశ నోటిఫికేషన్‌తో కొలిక్కి వచ్చింది. మొత్తం ఈ భూమిలో దాదాపుగా 2,200 ఎకరాలను విమానాశ్రయం నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించింది.

నిర్వాసితులకు మంచి కాలనీలు

ఇళ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాల కోసం రూ.80 కోట్ల వ్యయంతో టౌన్‌షిప్‌లను తలదన్నేలా రెండు కాలనీలను ప్రభుత్వం నిర్మించింది. తొలుత 376 కుటుంబాలకు పునరావాస పరిహారంగా ఐదు సెంట్ల చొప్పున ఇంటి స్థలం, రూ.8.70 లక్షల చొప్పున పరిహారం, అదనంగా మరో రూ.50 వేల చొప్పున రవాణా ఖర్చును ప్రభుత్వం అందించింది. ఇటీవలే మరో 28 కుటుంబాలకు అదే తరహా ప్యాకేజీని ప్రకటించింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే ఘనత

ఉమ్మడి విజయనగరం జిల్లా వాసుల చిరకాల స్వప్నం సాకారమవుతుందంటే ఆ ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. విమానాశ్రయానికి అవసరమైన అనుమతులను సాధించడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ స్థాయిలో విశ్వ ప్రయత్నాలు చేశారు. మరోవైపు క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకున్నారు. భూమి పరిస్థితిని బట్టి ఎకరాకు రూ.28 లక్షల నుంచి రూ.36 లక్షల వరకూ పరిహారం ప్రకటించారు. అంతకుముందు డి.పట్టా భూములకు టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన పరిహారం రూ.12.50లక్షలు మాత్రమే. అలాకాకుండా వారికీ జిరాయితీ భూమితో సమానంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, భోగాపురం మండల నాయకుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి తదితరులు రైతులతో చర్చించడంతో రైతులు చాలామంది హైకోర్టులో పిటిషన్లను ఉపసంహరించుకున్నారు. మిగతావాటినీ ఇటీవల హైకోర్టు పరిష్కరించింది.



నిర్వాసితుల కాలనీ

ఉత్తరాంధ్రకే తలమానికం



దాదాపు పదివేల కోట్ల రూపాయల వ్యయంతో సాకారం కానున్న గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకే తలమానికం. ఈ ప్రాంతవాసులకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు వస్తాయి. మే 3వ తేదీన శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు. పెద్ద ఎత్తున బహిరంగ నిర్వహించాలని నిర్ణయించారు. అందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నాం.

– మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్

నేలబావిలో పడి ఇద్దరు చిన్నారుల మృతి?

కురుపాం: కురుపాం మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ పరిధి పెదగూడ గిరిజన గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు నేలబావిలో పడి మృతి చెందినట్టు సమాచారం. పెదగూడ గ్రామానికి చెందిన ఊయక సందీప్ (5), ఆరిక సెబాస్టియన్ (4)అనే ఇద్దరు చిన్నారులు ఆటలాడుకుంటూ సోమవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో ఉన్ననేల భావి దగ్గరకు వెళ్లారు. ప్రమాదవ వశాత్తు బావిలో పడిపోయారు. ఈ దృశ్యాన్ని చూసిన యువతి గ్రామస్తులకు తెలియజేయడంతో అందరూ ఘటనా స్థలానికి చేరుకున్నారు. నేలబావిలో దిగి చిన్నా రులను బయటకు తీశారు. అప్పటికే చిన్నారు లు మృతి చెందడంతో తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. గిరిజన కట్టుబాట్ల ప్రకారం విషయం బయటకు తెలియకుండా ఇద్దరు చిన్నారులను ఖననం చేసినట్టు సమాచారం. ఈ ఘటనపై నీలకంఠాపురం ఎస్ఐ అనీల్ వద్ద ప్రస్తావించగా తమకు ఎటువంటి సమాచారం అందలేదన్నారు.

కల నిజమాయె..



ప్రజాసంకల్పయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న డీఎస్సీ-98 అభ్యర్థులు

- డీఎస్సీ-98 క్వాలిఫైడ్ అభ్యర్థులకు పోస్టింగ్‌లకు గ్రీన్ సిగ్నల్
- జీఓ 27ను విడుదల చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి విజయనగరం జిల్లాలో 489 మందికి ఉద్యోగ అవకాశం
- కాంట్రాక్టు ఎస్‌జీటీలుగా ఏకోపాధ్యాయ స్కూళ్లకు కేటాయించేందుకు సన్నాహాలు

జిల్లాలో ఉన్న అర్హులు	489
జీఓ ప్రకారం ఖాళీలు	489
వాస్తవ ఖాళీలు	359
తూర్పుగోదావరి జిల్లానుంచి మన జిల్లాకు బదలాయింపు	130

విజయనగరం పూల్‌బాగ్:

ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న డీఎస్సీ-98 అభ్యర్థుల కల నిజమయ్యే రోజు ఆసన్నమైంది. ఏడాది కిందట ఉద్యోగాల్లో నియమిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అర్హత పత్రాల పరిశీలనను పూర్తిచేసింది. ఈ నెల 12,13 తేదీల్లో నియామక ఉత్తర్వులు అందించేందుకు వీలుగా విద్యాశాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ నెల 15 నాటికి 60 ఏళ్ల వయసులోపు ఉన్న అర్హులైన అభ్యర్థులకు జిల్లా ఎంపిక కమిటీ కౌన్సెలింగ్ ద్వారా ఒప్పంద ప్రాతిపదికన ఉపాధ్యాయులుగా నియమంచనుంది. దీనికి సంబంధించిన షెడ్యూల్ రూపొందించింది. ఇప్పటికే అర్హుల తాత్కాలిక జాబితాను జిల్లా ఎంపిక ఆమోదంతో డీఈఓలు విడుదల చేశారు. ఇందులో ఉన్నవారికి 11న సమాచారం ఇస్తారు. 12,13 తేదీల్లో వారికి కౌన్సెలింగ్ నిర్వహించి నియామకపత్రాలు అందజేస్తారు. 14న ఈ జాబితాను రాష్ట్ర అధికారులకు పంపిస్తారు. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల వారీగా జరిగే నియామక ప్రక్రియలో భాగంగా తొలుత ఒకే ఉపాధ్యాయుడు పనిచేస్తున్న ప్రాథమిక పాఠశాలలు, గురువులు కొరత ఉన్న, ఎక్కువ మంది విద్యార్థులకు తక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న చోట, ఆ తర్వాత మిగిలిన ఖాళీల్లో ప్రాధాన్యతా క్రమంలో నియమిస్తారు. ఏదైనా జిల్లాలో అర్హులు ఎక్కువమంది ఉండి, తక్కువ ఖాళీలు ఉంటే రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో ఉన్న ఖాళీల భర్తీకి అక్కడకు బదలాయిస్తారు. వీరు ఆ జిల్లాలో నియామకాల ద్వారా విధుల్లో చేరాల్సి ఉంటుంది. డీఎస్సీ-98 సంబంధించిన అభ్యర్థుల్లో కనీసం టైమ్ స్కేల్‌కు పనిచేయటానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అర్హులైన అభ్యర్థులు వివరాలు ఆన్‌లైన్ (httpr://riter. goofe.com/rite/doevizianafaram)లో పొందుపర్చడం జరిగింది. ఈ సైట్‌లో పొందుపర్చిన అభ్యర్థులు తప్పనిసరిగా ఈనెల 12వ తేదీన ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు ఆధార్‌కార్డు, పాస్‌ఫొటోలు 5, డీఎస్సీ-98 హాల్‌టిక్కెట్‌ను తీసుకుని విజయనగరం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని అధికారులు కోరారు.


12న కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి



డీఎస్సీ-98 సంబంధించిన అభ్యర్థుల్లో మినిమమ్ టైమ్‌స్కేల్‌పై పనిచేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అర్హులైన అభ్యర్థుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాం. ఈ సైట్‌లో పొందుపర్చిన అభ్యర్థులు తప్పనిసరిగా ఈ నెల 12వ తేదీన ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు ఆధార్ కార్డు, పాస్‌ఫొటోలు-5, డీఎస్సీ-98 హాల్‌టిక్కెట్‌ను తీసుకుని విజయనగరం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి.

–బి.లింగేశ్వరరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి, విజయనగరం.


25 ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం..



ఉద్యోగాల్లో చేరేందుకు 25 ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మా జీవితాల్లో వెలుగులు నింపారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చడంతో మా కుటుంబ సభ్యులంతా ఆయనకు రుణపడిఉంటాం.

– పి.లక్ష్మణరావు, డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థి, విజయనగరం

న్యాయం చేశారు



రెండు దశాబ్దాలుగా మేం పోరాటాలు చేస్తున్నా మా సమస్య పరిష్కారం కాలేదు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక మాకు న్యాయం చేశారు. ఆయన చేసిన సాయం మరచిపోలేం. గురువు కల నిజమయ్యే రోజు వచ్చింది.

– ఆర్‌వి ప్రసాద్, డీఎస్సీ-98 క్వాలిఫైడ్ అభ్యర్థి, పార్వతీపురం

ప్రతి ఇంటా 'సంక్షేమం'



డిప్యూటీ సీఎం సమక్షంలో జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవండి
- డిప్యూటీసీఎం రాజన్నదొర

సాలూరు:

రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పాలన సాగుతోందని, అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలందరూ మద్దతు తెలపాలని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర కోరారు. సచివాలయ మండల కన్వీనర్ కళ్లేపల్లి త్రినాథ్ ఆధ్వర్యంలో మండలంలోని బాగువలస, వల్లాపురం, దేవుబుచ్చింపేట, చంద్రంపేట గ్రామాల్లో సోమవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలతో మమేకమయ్యారు. చంద్రబాబు, జగన్‌మోహన్ రెడ్డి పాలనల మధ్య వ్యత్యాసాన్ని తెలియజేశారు. నాడు పింఛన్ కావాలంటే జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సి వచ్చేదని, నేడు అర్హులందరికీ పింఛన్ల మంజూరుతో పాటు ఇంటివద్దకే వచ్చి పింఛన్లు అందజేసే వ్యవస్థను సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందుబాటులోకి తెచ్చారన్నారు. ఊరిలో పింఛన్‌దారు చనిపోతేనే మరొకరికి మంజూరుచేసే దుస్థితిపోయిందన్నారు. పేదకుటుంబాల పిల్లలు చదువుకునే ఊరిబడిని నాడు పట్టించుకునేవారే కాదని, నేడు ఆకర్షణీయంగా, అందంగా ముస్తాబుచేశారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పేదకుటుంబాల పిల్లలు పోటీపడేలా ఆంగ్లమాధ్యమం చదువులు అందుబాటులోకి వచ్చాయన్నారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థుల చదువుఖర్చులను ప్రభుత్వమే భరిస్తోందన్నారు. విత్తనాల నుంచి పంటకొనుగోలు వరకు ఊరిలోని ఆర్‌బీకేల నుంచి సేవలు అందజేస్తున్నారని, సచివాలయ వ్యవస్థతో ఎలాంటి వ్యయప్రయాసలు లేకుండా ప్రభుత్వ సేవలు అందుతున్నాయని తెలిపారు. పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా, అత్యంతపారదర్శకంగా, అవినీతిరహితంగా సాగుతున్న సంక్షేమ, అభివృద్ధి పాలనను వివరించి ప్రజాభిప్రాయాలు సేకరించారు. ఇంటింటికీ 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించారు. ప్రజలకు మోసం చేయడం చంద్రబాబు నైజమని, ఆయన మాయమాటలు నమ్మొద్దని ప్రజలను హెచ్చరించారు. జగనన్నకు మద్దతుగా నిలిచి, 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మరలా ఆశీర్వదించాలని కోరారు. మా నమ్మకం నువ్వే జగన్ అన్న ప్రజానినాదం నుంచి వచ్చినదే జగనన్న మా భవిష్యత్ కార్యక్రమంగా పేర్కొన్నారు. బాగువలసలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఏఎమ్‌సీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, నాయకులు దండి శ్రీనివాసరావు, రెడ్డిసుకన్య, సువ్వాడ రామకృష్ణ, భరత్‌శ్రీనివాస్, మువ్వల ఆదయ్య, సంగం రెడ్డి జయసింహ, రఘుపాత్రుని సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు. సాలూరు పట్టణంలోని 8వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పాలనను వివరించారు. జగనన్నకు అండగా నిలవాలని ప్రజలను కోరారు.



సాలూరు 8వ వార్డులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప్తి

క్లుప్తంగా

40 మద్యం సీసాల పట్టివేత



పట్టుకున్న మద్యం సీసాలతో ఎస్సై హరిబాబు నాయుడు

గుర్ల: మండలంలోని జమ్ముపేటలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యకిని ఎస్సై హరిబాబు నాయుడు సోమవారం ఆరెస్ట్ చేసి 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు. అరెస్ట్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొట్లాటలో మహిళకు గాయాలు



చికిత్సపొందుతున్న జయలక్ష్మి

పార్వతీపురం: పట్టణంలోని కంచర వీధికి చెందిన ఎస్. జయలక్ష్మిని పక్క షాప్‌కు చెందిన ఎస్. నాగరాజు, భార్య శారదలు కొట్టిన ఘటనలో జయలక్ష్మి తల, వీపుపైన గాయాలయ్యాయి. పిల్లల మధ్య జరిగిన గొడవ పెద్దల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ మేరకు చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి క్షతగాత్రురాలిని తరలించారు. అవుట్‌పోస్టు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చింత చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో సోమవారం చింత చెట్టుపై నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిల్ల సీతయ్య అలియాస్ పేతురు (63) ఆర్అండ్‌బీ రాష్ట్ర రహదారిని ఆనుకుని ఉన్న చింత చెట్టు ఎక్కి బొట్టలు రాలుస్తూ కొమ్మలు దాటుతుండగా జారి పడడంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య సాయమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కాలిపోయి వృద్ధురాలు..

బలిజిపేట: మండలంలోని వెంగాపురం గ్రామానికి చెందిన జామి కళావతి(72) ప్రమాదవశాత్తు సోమవారం మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి. కళావతి ఇంటిదగ్గర పొయ్యిపై వేడినీళ్లు దించుతుండగా చీరకు మంట అంటుకోవడంతో కాలిపోయి ప్రమాదానికి గురైంది. దీంతో ఆమెను పార్వపురం జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ఈ సంఘటనపై కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రశాంత్‌కుమార్ కేసు నమోదు చేశారు.

ఆటో డ్రైవర్‌కు 5రోజుల జైలుశిక్ష

విజయనగరం లీగల్: మద్యం తాగి మత్తులో ఆటో నడిపిన డ్రైవర్‌కు 5 రోజుల జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ విజయనగరం సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సోమవారం తీర్పు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఎస్పీ దీపిక అందించిన వివరాలిలా ఉన్నాయి. నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో రామతీర్థం జంక్షన్ వద్ద మార్చి 24న నెల్లిమర్ల ఎస్సై, పోలీస్ సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, మద్యం తాగి రామతీర్థం గ్రామానికి చెందిన తాడి సతీష్ కుమార్ పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. ఈ మేరకు తాడి సతీష్‌కుమార్‌కు 5 రోజుల జైలు శిక్షతో పాటు రూ. 500లు జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు వెల్లడించారు.

హోమియో వైద్యానికి పెరుగుతున్న ఆదరణ

విజయనగరం ఫోర్ట్: హోమియో వైద్యానికి ఆదరణ పెరుగుతోందని సీనియర్ హోమియో వైద్యాధికారి జి. వరప్రసాద్ తెలిపారు. ప్రపంచ హోమియో దినోత్సవాన్ని సోమవారం స్థానిక హోమియో వైద్యశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోలో పరిష్కారం ఉందన్నారు. గతంలో కంటే హోమియో వైద్యశాలకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ ఆయుర్వేద వైద్యాధికారి ధనుంజయ, డాక్టర్ స్వప్న, పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹100	₹170	₹ 180

భూసారానికి పరీక్ష

- పరీక్షల ఆధారంగా పంటల సాగు మేలు



భూసార పరీక్ష కేంద్రం



సూక్ష్మ పోషకాల ప్రమాణాలు తెలిపే బ్యానర్

విజయనగరం ఫోర్ట్: రైతు సంక్షేమానికి అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వారికి మేలు చేసేందుకు మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కోవిడ్ కారణంగా రెండేళ్ల పాటు నిలిచిపోయిన భూసార పరీక్షలను మళ్లీ నిర్వహించనుంది. ఈ మేరకు జిల్లాలో భూసార పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

భూసార పరీక్షలపై శిక్షణ

భూసార పరీక్షలు చేయడంపై ఈనెల 12 నుంచి 16 వతేదీ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు లేదా ఉద్యాన సహాయకులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు 12 వతేదీన జిల్లా స్థాయిలో, 13 వతేదీ నుంచి 16 వరకు మండలస్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు.

12 రకాల పరీక్షలు

రైతుల పొలాల్లో సేకరించిన మట్టి నమూనాలకు 12 రకాల పరీక్షలు చేయనున్నారు. అవి ఉదజని సూచిక (పీహెచ్), లవణ సూచిక (ఈసీ), సేంద్రియ కర్బనం, నత్రజని, బాస్వరం, పొటాష్, సల్ఫర్, జింక్, కాపర్, మెగ్నీషియం, ఐరన్, బోరాన్ పరీక్షలు. అవి సమతుల్యంగా ఉంటే పంటలు అధిక దిగుబడిని ఇస్తాయి.

భూసార పరీక్ష చేసే కేంద్రాలు

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న భూసార పరీక్షా కేంద్రం, నెల్లిమర్ల, చీపురుపల్లి, సారిక, రాజాం ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్స్‌లో భూసార పరీక్షలు చేయనున్నారు. భూసార పరీక్ష చేయించి సమతుల్య పోషక పదార్థాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించవచ్చు. ఎరువులు సమర్థంగా, పొదుపుగా వినియోగించి భూసారాన్ని కాపాడుకోవచ్చు. భూసార పరీక్ష వల్ల భూమిలో ఉన్న పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార స్థితి, చౌడు ఇతర సమస్యలు తెలుస్తాయి. సిఫార్సు చేసిన ఎరువులు వాడడం వల్ల ఎరువులపై అనవసర ఖర్చు తగ్గుతుంది, భూమి సాగుకు అనువుగా ఉందో లేదో తెలుస్తుంది.



ఉదజని సూచిక పరీక్ష చేస్తున్న వ్యవసాయ అధికారి

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

భూసార పరీక్షలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. భూసార పరీక్ష కేంద్రం, ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్స్‌లో పరీక్షలు చేస్తాం. సిబ్బందికి శిక్షణ కూడా ఇవ్వనున్నాం. జూలై నెలఖారు కల్లా మట్టి నమూనాల సేకరణ, పరీక్ష ఫలితాలు పూర్తి చేసి రైతులకు అందజేస్తాం.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

మట్టి నమూనా తీసేటప్పుడు జాగ్రత్తలు

- పొలంలో పంట ఉన్నప్పుడు, మొక్కల వరుసల మధ్య తీయాలి.
- అతి సారవంతమైన చోట్ల, అతి నిస్సారమైన చోట్ల నుంచి గాని మట్టిని తీసి, ఒకే నమూనా కింద కలపరాదు.
- రసాయన ఎరువులు వేయగానే మట్టి నమూనా తీయరాదు.
- గట్ల పక్కన చెట్ల కింద, చిత్తడి నేల, బండ్ల బాట, పెంట పోగులు వేసిన చోట్ల మట్టి నమూనా తీయరాదు.
- మట్టి నమూనాలు నింపే సంచులు రసాయన ఎరువులతో సంబంధం లేనివై ఉండాలి.

వినతులు తక్షణమే పరిష్కరించాలి



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

పార్వతీపురం: స్పందన కార్యక్రమానికి వచ్చే వినతులపై తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా అధికారులను కలెక్టర్ నిషాంత్ కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ఆయన స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి 80 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు పాల్గొన్నారు.

శ్మశాన రోడ్ల ఆక్రమణ

- కొమరాడ మండలం రాయపురంలో మూడు శ్మశాన వాటికలు ప్రభుత్వ స్థలంలో ఉన్నాయని శ్మశాన వాటికలకు వెళ్లే రహదారులను కూడా కొంత మంది ఆక్రమించడం వల్ల ఇబ్బంది పడుతున్నామని హెచ్.సురేష్ కుమార్, తదితరులు దరఖాస్తు అందజేశారు.
- పాచిపెంట మండలం మోసూరు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనం (కమ్యూనిటీ హాల్) మంజూరు చేయాలని సర్పంచ్ జి.చంటి, గ్రామస్తులు కోరారు.
- గుమ్మలక్ష్మీపురం మండలం గొయిపాక గ్రామానికి చెందిన కె.ఫిలిప్ కుమార్ దేరువాడ నుంచి బీరుపాడు వరకు రోడ్డు మరమ్మతులు పూర్తి చేయాలని విన్నవించారు.
- పార్వతీపురం మండలం కొత్తవలస గ్రామానికి చెందిన పి.విజయలక్ష్మి పీఎం కిసాన్, రైతు భరోసా మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించింది.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం టౌన్: స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి వారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చని, వాటిపై చట్టపరిధిలో విచారణ చేపట్టి నిర్దీత గడువులోపు పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, దిశ డీఎస్పీ ఎస్ఆర్ హరిత, ఏఆర్‌డీఎస్పీ బి.నాగేశ్వరరావు, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ ప్రభాకర్, ఎస్సై పి.దినకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా అరుదైన శస్త్రచికిత్స

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ఓయువతిని ఆదుకుంది. వేలమందిలో ఒకరికి వచ్చే అరుదైన వ్యాధితో బాధపడుతున్న యువతికి స్వస్థత చేకూర్చింది. వివరాలిలా ఉన్నాయి. గుర్ల మండలం చోడవరం గ్రామానికి చెందిన యువతి బి.భవాని (18) కొంతకాలంగా ఎక్సిజిస్ ఆఫ్ సర్వైకల్ (భుజంతో పాటు చేయి పైకి లేవలేని పరిస్థితి) వ్యాధితో బాధపడుతుంది. ఈ విషయమై ఆమె కుటుంబ సభ్యులు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజుకు మొర పెట్టుకోవడంతో ఆయన కొద్ది రోజులు క్రితం బాధిత యువతిని పట్టణంలోని తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో చేర్పించారు. న్యూరోసర్జరీ, న్యూరో మెడిసిన్, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, అనస్థీషియా విభాగాలకు చెందిన వైద్యులు నాలుగు గంటల పాటు శ్రమించి యువతికి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో కోలుకుంటోంది. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా తమ కుమార్తెకు ఉచితంగా శస్త్రచికిత్స జరగడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



భవానీని పరామర్శిస్తున్న ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ అప్పలరాజు

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతిచెందిన శివ

మక్కువ: మండలంలోని కవిరిపల్లి గ్రామ సమీపంలో సోమవారం రాత్రి బైక్ అదుపు తప్పి జరిగిన ప్రమాదంలో సాలూరులోని బంగారమ్మకాలనీకి చెందిన నగిరి కట్ల శివ(30) మృతి చెందాడు. స్నేహితుడు సబ్బరపు శంకర్‌తో కలిసి నగిరికట్ల శివ ద్విచక్ర వాహనంపై మక్కువ వచ్చాడు. మక్కువ నుంచి కవిరిపల్లి మీదుగా సాలూరు వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో శివ అక్కడికక్కడే మృతిచెందగా, శంకర్‌కు గాయాలయ్యాయి. మృతుడు శివకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



సోమేశ్వరరావు మృతదేహం

జియ్యమ్మవలస: మండలంలోని తాళ్లడుమ్మ గ్రామానికి చెందిన పట్నాన సోమేశ్వరరావు (38) తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కళాధర్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమేశ్వరరావు తొలుత చాకుతో శరీరంపై పొడుచుకుని అనంతరం తాడుతో ఉరి వేసుకున్నాడు. మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడం, మద్యానికి బానిస కావడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు సోమేశ్వరరావు భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కలెక్టర్ స్పందనకు 176 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ గణపతిరావు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం అర్బన్: స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ ఎ.సూర్య కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 176 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి చెందిన వినతులు 115 ఉన్నాయి. హౌసింగ్ 9, మున్సిపల్ శాఖ 3, వైద్యశాఖ 9, డీఆర్‌డీఏ 14, మిగిలినవి వివిధ శాఖలకు చెందిన అర్జీలున్నాయి. పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై వినతులు అందాయి. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ప్రత్యేతక ఉప కలెక్టర్లు సూర్యనారాయణ, పద్మలత, దొర పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

జామి మండల కేంద్రాన్ని ఆనుకుని ఉన్న గంగిరెడ్లు, రెల్లి వాడల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ వాడల మహిళలు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం వినతిపత్రాన్ని జేసీ మయూర్ అశోక్‌కు అందజేశారు. కాలనీ శివారులో తాగునీటి బోరు ఉన్నప్పటికీ అందులోనుంచి మురుగునీరు వస్తోందని స్థానికంగా చెప్పుకున్నా ఎవరూ పట్టించుకోలేదని వినతిలో పేర్కొన్నారు. దీంతో కిలోమీటర్ దూరంలో ఉన్న తాగునీటిని తెచ్చుకోవలసి వస్తోందని వాపోయారు. జేసీని కలిసిన వారిలో డి.దుర్గ, డి.సంతోష్, బి.సత్తమ్మ తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలి

విజయనగరం క్రైమ్: స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఆమె 23 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలను విని సంబంధిత అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్‌లో సూచనలు చేశారు. ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, ఎస్టీ సీఐ సీహెచ్.రుద్రశేఖర్, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి



ఆందోళన కారులకు నచ్చచెబుతున్న డీఎస్పీ కృష్ణారావు

- మరోసారి మృతదేహంతో బంధువుల ఆందోళన

పాలకొండ: నగరపంచాయతీలోని ఎన్‌కేరాజపురంలో ఇద్దరి యువకుల మధ్య జరిగిన కొట్లాటలో దెబ్బలు తగిలిన మోహనరావు తండ్రి చంద్రరావు మృతిచెందిన విషయం తెలిసిందే. ఇదే విషయమై మృతుని బంధువులతో పాటు గ్రామస్తులు ఆదివారం పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. పోలీసులు, గ్రామపెద్దలు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. తాజాగా సోమవారం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని తీసుకువచ్చిన సమయంలో సమయంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట మృతదేహంతో పాటు మృతుని బంధువులు మరోసారి ఆందోళనకు దిగారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించడంతో గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ఎంత చెప్పినా వినకుండా సబ్ కలెక్టర్ వచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సబ్‌కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో డీఎస్పీ కృష్ణారావు బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, కేసు విచారణ చేస్తున్నామని వివరించారు. దీంతో ఆందోళన విరమించిన బాధితులు మృతదేహాన్ని తరలించారు.

నాగావళిలో పడి బీటెక్ విద్యార్థి మృతి



సునీల్ కుమార్ (ఫైల్)

బొబ్బిలి/గరుగుబిల్లి: బొబ్బిలి మండలంలోని రాముడు వలసకు చెందిన లచ్చిరెడ్డి సునీల్‌కుమార్ (24)గరుగుబిల్లి మండలం సంతోషపురం పంచాయితీ పిట్టల మెట్ట వద్ద నాగావళి నదిలో ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందాడు. సోమవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బెంగళూరులో చదువుతున్న సునీల్ రెండు రోజుల క్రితమే స్వగ్రామం వచ్చి పండగనిమిత్తం స్నేహితులు, బంధువులతో పిట్టల మెట్ట గ్రామానికి వెళ్లాడు. అందరూ కలిసి సరదాగా నాగావళి నదికి వెళ్లగా ప్రమాదం జరిగింది. సునీల్ తండ్రి తిరుపతి రావు రాజాకాలేజీలో తాత్కాలిక పద్ధతిన లెక్చరర్‌గా పనిచేస్తుండగా తల్లి శకుంతల గృహిణి. ఈ దంపతుల పెద్ద కుమారుడు లోకేష్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.

ఇంటర్న్‌షిప్‌తో ఉద్యోగావకాశాలు అధికం



హాజరైన విద్యార్థులు

విజయనగరం అర్బన్: నూతన విద్యావిధానంలో డిగ్రీ విద్యార్థులకు అమలు చేస్తున్న ఇంటర్న్‌షిప్ ద్వారా ఉద్యోగావకాశాలు అధికంగా ఉంటాయని ఐకాన్ ఫార్మా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పి.వాసు అన్నారు. ఈ మేరకు స్థానిక మహరాజా అటానమస్ కళాశాలలో రసాయన శాస్త్రం విద్యార్థులకు 'జాతీయ విద్యా విధానం-2020'పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 10 నెలల ఇంటర్న్‌షిప్‌ను తృతీయ సంవత్సరం విద్యార్థులు తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. ఐకాన్ ఫార్మాస్యూటికల్స్‌లో ల్యాబొరేటరీలో ఉద్యోగం పొందే విధంగా హెచ్‌పీఎల్‌సీ, ఐఆర్ స్పెక్ట్రో ఫోటో మీటర్ వంటి అధునాతన పరికరాలతో 6 నెలలపాటు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి, స్టూడెంట్స్ కన్వీనర్ వి.బాబ్జీ, అకడమిక్ కన్వీనర్ పీఎస్ఎన్‌రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ జి.చంద్రశేఖర్, టి.భారతి, కె.మాధురి, డి.పావని పాల్గొన్నారు.

కలెక్టర్‌కు 'ఫోరం ఫర్ బెటర్ విజయనగరం' అభినందన



కలెక్టర్ సూర్యకుమారిని అభినందిస్తున్న దృశ్యం

విజయనగరం అర్బన్: బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారిని ఫోరమ్ ఫర్ బెటర్ విజయనగరం తరపున చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాశ్, రోటరీ క్లబ్ అధ్యక్షురాలు ఉమా బాలాజీ, రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ కార్యదర్శి కొల్లా సాయి మనోజ్, డైరెక్టర్ మధుసూదన్, గోల్డెన్ హెరిటేజ్ గ్రూప్ లిఫ్టింగ్ హ్యాండ్స్ కార్యదర్శి సూర్యలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి కలెక్టర్‌గా పదవీ బాధ్యత విజయవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ విజయనగరంలో పని చేసిన కాలం మరచిపోలేనని ఎక్కడికి వెళ్లినా ఇది తన పుట్టినిల్లుగానే భావిస్తానని చెప్పారు. జిల్లాలో అందరూ మంచి మనసుతో అభిమానంతో ఆత్మీయంగా ఎప్పటికీ గుర్తుండేలా నడుచుకుంటార న్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యార్థి నేతలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వెంకటేష్, పి. రామ్మోహనరావు డిమాండ్ చేశారు. అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ నుంచి విద్యార్థి నేతలను సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ సోమవారం స్థానిక కోట జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అక్రమాలకు పాల్పడిన హెచ్‌ఓడీని ప్రశ్నించినందుకు విద్యార్థి నేతలను సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ పావని, చిన్నబాబు, రాము, రామకృష్ణ, రవి, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE
■ కేవలం 22 లక్షలకే 117 గజాల స్థలం + 800 SFT ఇండివిడ్యువల్ గెస్ట్‌హౌస్. బోరు, ప్రహరీ గోడ, పంచాయితీ ఎప్రూవ్‌డ్ లేఅవుట్‌లో బ్లాక్ టాప్ రోడ్స్, 3 ఫేజ్ పవర్. విజయనగరం అతి సమీపంలో 9143143818 [S-1154271]

TO-LET
■ విజయనగరం, కోట దగ్గర, పోతత్తూరివారి వీధిలో 3 అంతస్తుల కమర్షియల్ బిల్డింగ్ అద్దెకు కలదు. (ఫ్లోర్‌కు 850 SFT). Cell: 9701540561. [S-1154281]

ASTROLOGY
■ గాయత్రి జోతిష్యం : విద్య, ఉద్యోగం, వ్యాపారం, వివాహం, సంతానం, ప్రేమ, భార్యభర్తల మధ్య గొడవలు, ఆర్థిక సమస్యలు మీకు ఏటువంటి సమస్యలకైనా శాశ్వత పరిష్కారం చేయబడును. భాష్యం స్కూల్ ఎదురుగా VZM. ఫోన్ : 97017 78711 [V- 1541]

SERVICES
■ అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ✆ 9115551443. [T-04]

WANTED
■ మీ ఇంటిదగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20,000 వరకు జీతం. మరిన్ని వివరాలకై. Cont: 8019995348 [G-785727]
■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్, ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785726]
■ హైదరాబాద్‌లోని ఆప్తా హోంకేర్‌లో వృద్ధులను చూసుకోవడానికి 21-45 వయసు గల M/F Ceretakers కావలెను.జీతం:16-18వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్సు గలవు. +91 6300813664 [G-537]
■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, RMP, Dr., Q: 5th - డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd. Ph: 7995984445 [H-16]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.